**కథ**

**“ఈ రెండు జాతకాలు దివ్యంగా కలిసాయి. ఇంక నిశ్చింతగా వివాహముహూర్తం పెట్టుకోవడం మంచిది రాఘవరావు గారూ!”**

**అంటూ మణిశర్మ చిరునవ్వుతో ఎదురుగా ఉన్న వ్యక్తి వైపు దృష్టి సారించాడు. అతని వదనం గంభీరంగా ఉంది. ఆ కళ్ళల్లో ఇంకా ఎన్నో సందేహాలు ప్రతిఫలిస్తున్నాయి. జాతకాలు కలిశాయని చెప్పగానే చాలామందిలో వెల్లివిరిసే సంతోషపు ఛాయలు అతనిలో లేవు.**

# నాకీ నమ్మకం చాలు

బట్టలషాపు ఓనరు రాఘవరావంటే ఊళ్ళో మంచి పేరుంది. ఆస్తిపాస్తులకి లోటు లేదు. ఆధ్యాత్మిక ఉపన్యాసాలన్నా, భగవంతుని సేవా కార్యక్రమాలన్నా మహాప్రీతి.

జ్యోతిష్యం పట్ల ఎనలేని గౌరవం, భక్తి ఉన్నాయి. వారం రోజుల క్రితం వచ్చి-

''శర్మగారూ! మా అమ్మాయికి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను. ఈ జాతకాల్ని చూసి కలిసాయో లేదో చెప్పండి'' అంటూ జాతకాలిచ్చాడతను.

ఆ రోజు నుండి రెండు జాతకాల్ని వివరంగా పరిశీలించాడు. వివాహానికనుకూలంగా రెండు జాతకాలు అద్భుతంగా కలిసాయి.

అయినా ఈ పెద్దమనిషిలో ఉత్సాహం లేదెందుకు?

అతను తన దగ్గర ఏదో రహస్యం దాస్తున్నాడనిపించింది మణిశర్మకి.

కాస్త గొంతు తగ్గించి ''రాఘవరావుగారూ! సందేహించకండి. మీ అనుమానాన్ని బయటకి చెప్పండి. పరిష్కారం ఆలోచిస్తాను'' భరోసా ఇస్తున్నట్లుగా అన్నాడు.

రెండు నిమిషాలు గడిచాయి. రాఘవరావు గొంతు విప్పాడు.

''శర్మగారూ! అమ్మాయి మాకంటే తక్కువ కులం ఉన్న అబ్బాయిని ప్రేమించింది. ఆ అబ్బాయి డాక్టర్. మంచి మనిషి. అబ్బాయి కూడా అమ్మాయిని మనస్ఫూర్తిగా ప్రేమించానని చెప్పాడు. పెద్దలు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా పెళ్ళి చేసుకుంటామని అమ్మాయి, అబ్బాయి ఖచ్చితంగా చెప్పారు.

అమ్మాయిని బాధపెట్టి వేరొకర్ని ఇచ్చి పెళ్ళి చెయ్యడం నాకిష్టంలేదు. జాతకాలు కలిస్తే... వాళ్ళు పెళ్ళి చేసుకున్నా ఫర్వాలేదు. ఎక్కడున్నా సుఖంగా ఉంటారు. లేకపోతే- ఈ ప్రేమల పట్ల ఎవరికీ సదభిప్రాయం ఉండదు.

ఇంతకీ కులాంతర వివాహం మీద మీ అభిప్రాయం చెప్పండి శర్మగారూ! నాడీ జ్యోతిష్యంలో అపారమైన జ్ఞానాన్ని, విస్తారమైన కీర్తిని మీరు సంపాదించారు.

కుల పట్టింపుల వల్లే.. పిల్లలకి, పెద్దలకి మధ్య సంఘర్షణ ఏర్పడుతోంది.

మీరంగీకరిస్తే..ఈ పెళ్ళి నా చేతుల మీదుగా జరిపిస్తాను'' దృఢంగా అన్నాడతను.

అంతే! మణిశర్మ రాయిలా బిగుసుకుపోయాడు. మనసులో మాత్రం వేలకొలది సంచలనాలు మొదలయ్యాయి.

రాఘవరావుగారు చెప్పినది నూటికి నూరుపాళ్ళు నిజమే. జ్యోతిష్యంలో తను విశేషమైన జ్ఞానాన్ని ఆర్జించాడు. భూత, భవిష్యత్తు, వర్తమాన కాలంలో సంఘటనలు ఖచ్చితంగా తెలిపే ఈ శాస్త్రమంటే ఇప్పుడందరికీ ఆసక్తిగా ఉంది.

ఈ శాస్త్రాలను పరిశీలిస్తూ అహర్నిశలు జ్యోతిష్య శాస్త్రానికి అంకితమై... వివాహం కూడా చేసుకోకూడదనే నిర్ణయానికి వచ్చాడు.

కానీ...

నెల్లాళ్ళ క్రితం జరిగిన సంఘటన ఇప్పటికీ తనలో ఘర్షణ రేపుతోంది.

అంతరంగంలో ఏదో తాదాత్మ్యత. గోరు వెచ్చని జ్ఞాపకాలు.

రాఘవరావుగారు అక్కణ్ణుంచి వెళ్ళిపోవడం యధాలాపంగా మణిశర్మ గమనించాడు. మనసు మాత్రం..ఏదో పరిపూర్ణత కోసం అన్వేషిస్తోంది.

ప్రతినిత్యం ఆమె జ్ఞాపకాలు గుండె తలుపులు తట్టి మధురోహలకు ఊపిరిపోస్తున్నాయి.

ఎందుకిలా జరిగిందో ఓ జ్యోతిష్యవేత్తగా ఊహించలేకపోతున్నాడు.

ఊహకందని అద్భుతాలు కళ్ళముందు నిలిచి తన వివేకాన్ని, వ్యక్తిత్వాన్ని పరీక్షించాయి.

కాలం ఎంత గొప్పది. ఎక్కడెక్కడి మనుషుల్నో కలపడం కాదు. గత జన్మలో బాంధవ్యం ఉన్న వ్యక్తుల్ని కూడా కలుపుతుంది.

అతని కళ్ళ ముందు ముగ్ధ మోహన సౌందర్యం ఉట్టిపడే అమూల్య మెదిలింది. ఆ జ్ఞాపకాలు తలచుకుంటూ..కుర్చీ వెనక్కి విశ్రాంతిగా వాలాడతను.

★ ★ ★

రాత్రి పదకొండు దాటుతోంది. ఉద్వేగంతో, రెట్టింపైన ఉత్సాహంతో భృగునాడి విశేషాలను చదవసాగాడు మణిశర్మ. అతని కళ్ళు ఒకచోట ఆగిపోయాయి.

గుండె వేగంగా స్పందించింది. మరోసారి ఆ అక్షరాలను చదివాడు. గత జన్మలో మీ భార్యని రేపు చూస్తారని ఆ అక్షరాల సారాంశం.

అతడు ఆశ్చర్యపోలేదు. భూత, భవిష్యత్తు, వర్తమానంలో జరిగే సంఘటనలను యధాతథంగా తెలిపే ఆ శాస్త్రం పట్ల అమితమైన గౌరవాన్ని, భక్తిని ఏనాడో పెంచుకున్నాడు.

ఎందరెందరికో ఆ విశేషాలను తెలిపాడు. వాళ్ళని ఆశ్చర్యచకితుల్ని చేసాడు. కానీ... ఇప్పుడు తను ఊహించని అద్భుతం జరగబోతోందని తెలిసినప్పుడు శరీరం యావత్తు ఉద్వేగంతో ఊగిసలాడుతోంది.

ఆమెకి పెళ్ళయిందో! లేదో!

తన దగ్గరికి ఎందుకు వస్తోందో!

వివాహ ప్రసక్తి లేకుండా జీవితం మొత్తం ఈ శాస్త్రానికే అంకితం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఆమె ఆగమనం వల్ల మళ్ళీ తనలో కొత్త భావాలు, సరాగాలు చిగుళ్ల తొడుగుతాయేమో!

ఊహు! తను మానసికంగా బలహీనుడు కాదు. అపారమైన మనోనిగ్రహంతో జీవితం గడుపుతున్నాడు.

కానీ... ఎందుకో తెలీదు. ఈ అక్షరాలు చూస్తే మనసులో అలజడి అవధులు దాటుతోంది. ఆమెని చూస్తే... అవివాహితుడుగా ఉండిపోవాలన్న ఆశయం అణగారిపోతుందేమో!

మణిశర్మ కుర్చీలోంచి లేచి ఆకాశం వైపు దృష్టి సారించాడు.


నింగికి, నక్షత్రాలకు ఎన్ని జన్మల అనుబంధం వుందో తెలీదు.

మేఘాల మధ్య రారాజులా వెలిగిపోతున్న చంద్రుడు. తారలు ప్రతీరాత్రి ఈ ప్రపంచానికి కనువిందు చేస్తాయి. వీటి బంధం అద్వితీయమైనది.

కానీ- గత జన్మ బంధం..తనలో ఆనందాన్ని

నింపుతుందా! తీరని అశాంతిని కలిగిస్తుందో! ఈ సృష్టిలో అనుబంధాలు వేరు. మనుషుల మధ్య ఉన్న బాంధవ్యాలు వేరు.

ఎన్ని తరాలైనా ప్రకృతిలో బంధాలు చెక్కుచెదరవు. కానీ.. ఈనాటి వ్యక్తుల మధ్య అనుబంధాలు...నీటి బుడగల్లా తేలిపోతున్నాయి.



ఆమె అరవై ఏళ్ళు దాటిన స్త్రీరూపంలో కనిపించవచ్చు. లేకపోతే పది, పన్నెండేళ్ళ అమ్మాయి రూపంలో తారసపడవచ్చు.

ఏమైనా సరే! ఏది జరిగినా సరే!

రేపటి రోజు తన జీవితంలో మర్చిపోలేని రోజు.

ఆ రాత్రి మణిశర్మకి నిద్ర కరువైంది. కళ్ళ ముందు ఎన్నో ఊహారూపాలు.

ఆమె ఏం మాట్లాడుతుంది? ఎక్కణ్ణుంచి వస్తోంది. గత జన్మలో తమిద్దరి మధ్యా ఉన్న అనుబంధం గురించి ఆమెకి తెలుసా!... ఇలా ఎన్నో ఆలోచనలతో నలిగిపోయిన మణిశర్మ గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

★ ★ ★

ఆ మర్నాడు-

వివిధ జిల్లాల నుండి వచ్చిన జాతకాలను పరిశీలిస్తూ అప్రయత్నంగా వాచీ చూసాడు మణిశర్మ. టైమ్ సాయంకాలం ఆరు దాటుతోంది.

గోధూళి వేళ...!

పక్షులు గుంపులు గుంపులుగా ఆకాశంలోకి దూసుకొని పోతున్నాయి.

గూళ్ళకి చేరాలనే తాపత్రయం వాటిలో ఎంతగానో ప్రస్ఫుటిస్తోంది.

పశువులు ఒకదాని వెనుక ఒకటి నడుస్తూ ముందుకి సాగుతున్నాయి. సిటీకి దూరంగా ఉన్న ఆ ఇల్లంటే ఎంతగానో ఇష్టపడతాడు.

ఇంటి చుట్టూ కొబ్బరిచెట్లూ, దూరంగా మానవతా కిరణాలను అందరికీ ప్రసరింపజేసే షిరిడిసాయి గుడి, ఇంకాస్తా దూరంలో పాలు, పెరుగు అమ్ముకునే పల్లెజనం... మనసుకి ఆహ్లాదం కలిగిస్తుంటాయి.

మనిషి మానసికంగా అలిసిపోయినప్పుడు క్లబ్బులు, సినిమాలు సేద తీరుస్తాయన్నది వట్టి భ్రమ. అనంతమైన ప్రకృతి సౌందర్యం అమితమైన స్వాంతనను, ఓదార్పుని కలిగిస్తుంది.

మణిశర్మ దిగ్గునలేచాడు.

నాలుగడుగులు వేసి గుమ్మం దాటబోతుండగా జరిగిందా సంఘటన.

సుడి గాలిలా, మెరుపులా.. ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటంలా దూసుకువచ్చి మణిశర్మని ఢీకొంది ఓ అమ్మాయి.

నిర్ఘాంతపోతూ ''సారీ'' అంటూ దూరంగా నిలబడ్డాడు.

ఆమె కూడా కాస్త సిగ్గుపడి ''ఈరోజు ఎలాగైనా మిమ్మల్ని కలవాలనే ఆతృతతో వేగంగా వచ్చాను. పైగా మీ పని కుర్రాడు 'సార్ ఈ రోజు ఎవర్నీ కలవర'ని ఖచ్చితంగా చెప్పాడు. అయినా మిమ్మల్ని చూడాలనే ఆసక్తిని చంపుకోలేకపోయాను. ఆ కుర్రాడికి మీ బంధువునని అబద్ధం చెప్పి ఇలా వచ్చాను'' అందామె.

మణిశర్మకి పరిస్థితి అర్థమైంది. వెనక్కి వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు. అతనికెదురుగా ఆమె కూర్చుంది.

చాలాసేపటి వరకు నిశ్శబ్దం ఇద్దరిమధ్యా రాజ్యమేలింది. బాగా అలిసిపోయినట్లుగా ఉందామె. మణిశర్మ తన చేతుల మీదుగా మంచినీళ్ళు అందించాడు. ఆమె కళ్ళు వింతకాంతితో మెరిశాయి.

మణిశర్మ వైపు అభిమానంగా చూస్తూ ''నా పేరు అమూల్య. బేంకిలో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. మీరు నాడీ జ్యోతిష్యంలో విశేషమైన అనుభవం గడించారని విన్నాను'' అందామె.

మణిశర్మ మౌనం వహించాడు. ఉదయం నుండి ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. కానీ.. భగవంతుని నిర్ణయాన్ని ఎవరాపగలరు?

పసిమిఛాయతో మిలమిలా మెరుస్తోందామె. అనంతమైన సౌందర్యంతో అతని గుండెలో సంచలనం కలిగిస్తోంది.

''మా ఇంట్లో నాకు పెళ్ళి చేయాలని నిర్ణయించుకున్నారు. ఓ సంబంధం కూడా నిశ్చయించారు. సరిగ్గా ఆ సమయంలోనే హృషీకేష్, హరిద్వార్ చూడ్డానికి వెళ్ళాను. హరిద్వార్‌లో ఓ నాడీ జ్యోతిష్కుడు నా గత జన్మ వివరాలు చెప్పాడు.

గత జన్మలో మీరు నా భర్తని తెలిసింది. మీకింకా పెళ్ళి కాలేదని తెలుసుకున్నాను. ఈ వివరాలు తెలుసుకున్నాక..మరో మగాణ్ణి నా జీవితంలోకి ఆహ్వానించడానికి నా మనస్సంగీకరించడం లేదు.

హిందూ స్త్రీలు పెళ్ళిని ఏడు జన్మల అనుబంధంగా నమ్ముతారు. ఈ దేశ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల విపరీతమైన గౌరవముంది. మీరే గత జన్మలో నా భర్తని తెలిసాక పరాయి మగాడితో జీవితం సాగించినా అనుక్షణం మీరే నా కళ్ళ ముందు మెదులుతారు. ఇంకొక మనిషి మీద నా మనసు కూడా లగ్నం కావడం లేదు. ఈ శాస్త్రం యొక్క వివరాలు తెలీకపోతే.. ఖచ్చితంగా వేరొక

**విశ్వనాధ రమ**

వ్యక్తిని పెళ్ళి చేసుకునేదాన్ని.

కానీ...ఇప్పుడు నా ఆలోచనలన్నీ మీ చుట్టూ తిరుగుతున్నాయి. ఇది ఏ ప్రభావమో తెలీదు. ఇప్పుడు మీకన్నా నేను తక్కువ కులస్థురాలిని. మహారుషులెందరో ఈ జ్యోతిష్య గ్రంథాలను తయారుచేసారు. ఆ రుషులు కూడా తమ కులాలకతీతంగా వివాహాలు చేసుకున్నారు. నిత్యం ఆ గ్రంథాలను పఠనం చేసే మీరు కూడా కులమతాలకు విలువ ఇవ్వరని భావిస్తున్నాను. దీనికి పరిష్కారం మీరే చెప్పండి.

ఒక్క విషయం మాత్రం నిజం. మీరు మన వివాహానికి అంగీకరించకపోతే నేను అవివాహితగానే ఉండిపోతాను తప్ప వేరొకర్ని పెళ్ళాడను. ఇది పిచ్చి ప్రేమ అనండి. మరేదైనా అనండి'' చెప్పడం ముగించి ఊపిరి పీల్చుకుందామె.

స్థంభించిపోయాడు మణిశర్మ. ఈరోజు ఆమె వస్తుందని తెలుసుకున్నాడు కానీ... ఆమె మనోభావాలు ఊహించలేకపోయాడు.

కానీ- నాడీశాస్త్రానికే జీవితం ధారపోయాలని నిశ్చయించుకున్నాక మధ్యలో.. ఈ అడ్డంకులేమిటి?

వీల్లేదు. అమూల్య నిర్ణయం సమంజసమైనది కావచ్చు. కానీ ఆమెని తను వివాహం చేసుకోలేడు. తనకి శాస్త్ర పరిశోధన ముఖ్యం. సాంసారిక సుఖం కోసం ఏనాడూ ఆలోచించలేదు. ఓ అబద్ధం ఇప్పుడు సృష్టించాలి. తప్పదు.

తన జవాబు కోసం ఎదురు చూస్తున్న అమూల్యనుద్దేశించి అన్నాడతను.

''నా పేరుప్రఖ్యాతులు చూసి ఎందరో... ఇలా వస్తున్నారు. నాకు పెళ్ళి మీద ధ్యాస లేదు. ఈ శాస్త్రం యొక్క గొప్పతనాన్ని ప్రపంచమంతా గుర్తించేలా చేయడమే నా ధ్యేయం''

అమూల్య మరి మాట్లాడలేదు. అతని వైపు రెండు క్షణాలు బాధగా చూసింది. టేబిల్ మీదున్న మణిశర్మ ఫొటో అందుకొంటూ ''ఈ ఫొటో నా దగ్గరుంటే మీకభ్యంతరం లేదనుకుంటాను!'' అంది.

తీసుకోమన్నట్లుగా తలాడించాడతను. ఫొటో హేండ్ బేగ్‌లో ఉంచి తన అడ్రస్, వివరాలు అందించిందామె. మౌనంగా అందుకున్నాడు.

ఆమె వెళ్ళిపోతూంటే... గుండె కలుక్కుమందతనికి. మదిలో ఏదో శూన్యం. అనుబంధం..దూరమైపోతోందన్న బాధ సెగలా అణువణువునూ వ్యాపించింది.

అప్పుడే ఫోన్ రింగవడంతో మణిశర్మ ఆలోచనలు విడిపోయాయి. వర్తమానంలోకి వచ్చాడతను.

★ ★ ★

ఫోన్లో కులాంతర వివాహం గురించి ఎవరో ప్రశ్నిస్తున్నారు. నవ్వొచ్చింది మణిశర్మకి. ఏం సమాధానం చెబుతాడు?

శ్రీరంగనీతులు చెబుతూ... ఆ నీతులకు దూరంగా ఉండడమంత ఆత్మవంచన మరొకటి లేదు. ఆచరణలోనే ఉన్నతమైన లక్ష్యం కూడా మమేకం కావాలి.

మణిశర్మ కళ్ళ ముందు మళ్ళీ అమూల్య రూపం మెదిలింది. నిజంగా తననే ఆరాధిస్తూ అవివాహితగా మిగిలిపోతుందా!

ఆఫీసర్‌గా పనిచేస్తున్న అమూల్యకి తనకన్నా హోదా ఉన్న మగాడు భర్తగా రాకపోడు. అయినా తన మీద ఆశలు పెట్టుకోవడం ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

ఓ నమ్మకం..ఓ అనుబంధం ఆమె మొహంలో ప్రస్ఫుటంగా కనిపించడం గమనించి స్థిమితంగా ఉండలేకపోతున్నాడు.

కులాంతర వివాహానికి తను వ్యతిరేకి కాదు. ఎందరో యుగకర్తలు, మహానుభావులు కులం రక్కసిని కూకటివేళ్ళతో పెకిలించాలని నడుం కట్టారు.

ఆ అడుగుజాడల్లో నడవడం..ఎంత గొప్పతనం. సమాజ శ్రేయస్సులో పాలు పంచుకోవడం మానవత్వమే కదా!

కానీ..జరిగిన సంఘటనలన్నీ తలచుకొంటూంటే ఎంతో అద్భుతంగా కనిపిస్తున్నాయి. అమూల్య నిజంగా తన కోసం ఎదురుచూస్తుంటుందా!

ఒకసారి ఆమె దగ్గరికి వెళితే మంచిదేమో!

శాస్త్ర పరిశోధనకి వివాహం ఆటంకం అనుకోవడంలో అర్థం లేదు కూడా!

మణిశర్మ మనసు నిండా అమూల్యరూపం క్రమంగా ఆక్రమించుకుంటోంది. ఆమె దగ్గరికి వెళ్ళాలని నిశ్చయించు కున్నాడతను.

★ ★ ★

కొన్ని పరిచయాలు విచిత్రంగా అనుబంధంగా రూపుదిద్దుకుంటాయి.

వర్షపు చినుకులో..నింగిలో సాగిపోతున్న మబ్బులో..అమూల్య కనిపిస్తూంటే- మణిశర్మ..హృదయం రాగరంజితమైంది.

ఓ వర్షపు చినుకు పుడమిని సస్యశ్యామలం చేస్తుంది. ఓ స్త్రీ ఆగమనం మగాడి జీవన సరళినే మార్చివేస్తుంది. ఇన్నాళ్ళ ఒంటరిజీవితంలో ఏం కోల్పోయాడో అర్థమైంతనికి.

అమూల్య ఇంట్లో..

మణిశర్మని చూడగానే అమూల్య కళ్ళు నక్షత్రాలయ్యాయి. ఆమె ఒంటరిగా ఉండడం చూసి అతడెంతగానో ఆశ్చర్యపోతూంటే ''నా నిర్ణయం మా ఇంట్లో వాళ్ళకి ఎంత మాత్రం నచ్చలేదు. జన్మలు, అనుబంధాలు వట్టి ట్రాష్ అంటూ కొట్టిపారేసారు.

ఈ కంప్యూటర్ యుగంలో ఈ జన్మలో ప్రేమించి, పెళ్ళి చేసుకొన్నవాళ్ళే విభేదాలొచ్చి విడిపోతున్నారు. గత జన్మలో బంధాల్ని ఈ జన్మలో మళ్ళీ పటిష్టం చేసుకోవాలనుకోవడం వెర్రితనమన్నారు.

సైంటిఫిక్‌గా ఆలోచిస్తే వీటిల్లో నిజం లేకపోయినా మనసులో ఓ రూపం ఏర్పరుచుకున్నాక ఇంకొకరికి మనసివ్వడం కష్టమనిపించింది.

''అటు చూడండి'' అంటూ అమూల్య టేబిల్ మీదున్న ఫొటోలు చూపించింది.

టేబిల్ మీద మణిశర్మ, అమూల్య ఫొటోలు గువ్వల జంటలా పక్కపక్కనే ఉన్నాయి.

ఎన్ని జన్మలెత్తినా భర్తకి హైందవ స్త్రీ ఇస్తున్న విలువ, ఔన్నత్యం ఎంత గొప్పవో అర్థమైందతనికి. వెంటనే ఆమె చేయందుకుంటూ అన్నాడతను.

''అమూల్యా! కులాల పట్టింపు ఏనాడూ నాలో లేదు. మనం పెళ్ళి చేసుకుందాం!'' అన్నాడు.

అమూల్య కళ్ళల్లో కోటితారల వెలుగులు తళుక్కుమన్నాయి.

ఆరాత్రి రాఘవరావుగారితో ఫోన్లో మాట్లాడాడు మణిశర్మ.

''మీ అమ్మాయి పెళ్ళి నిరభ్యంతరంగా ఆమెకి నచ్చిన వ్యక్తితో, మీ చేతుల మీదుగా జరిపించండి. అర్థరహితం, ఆచరణ యోగ్యంకాని సిద్ధాంతాల్ని వదిలి సకల ప్రజలకు ఉపయోగపడే ఆదర్శాలతో అడుగులు వేయడం సమంజసం!'' అంటూ ముగించాడు.

మణిశర్మలో పరిపూర్ణత నిండుగా ఉందిప్పుడు.

మనసు ఉషోదయంలా వెలుగులు విరజిమ్ముతోంది.

